# అన్యథా శరణం నాస్తి....

గొప్ప చరిత్రగల శ్రోత్రియ సంగీత కుటుంబంలో పుట్టినా, గోపాలరావుకు చిన్నతవంనుంచి నాస్తిక భావాలు అలవడ్డాయి. దేముడు అన్న భావననే హేళనచేయటం, ప్రాచీన సంప్రదాయాలను, విశ్వాసాలను, ఆచారాలను అపహాస్యం చేయటమే అభ్యుదయంగా భావించే స్థితికి వెళ్ళాడు.

అటువంటి గోపాలరావుకు దేవదాయ ధర్మాదాయశాఖలో కాస్తంత పెద్ద ఉద్యోగమే దొరికింది.

ఆలోచనకు ఎదుగుదలకు నాస్తికత్వపు మేకును కొట్టేసుకు కూర్చున్న వెధవ్వి—దేముడికేం మేలు చేస్తావ్ ? ఆ దేముడిని నమ్ముకొన్న ప్రజలనేం ఉద్ధరిస్తావ్ ? మెటీరియలిస్టునని జండా కట్టుకొన్నావుగా-ఏ లేబర్ డిపార్టుమెంటులోనో, సేల్ టేక్స్ డిపార్టుమెంటులోనో ప్రయత్నంచేయి. భవుతిక లాభాలను బాగా పొందవచ్చు" అని అతని తండ్రి ఎగతాళిగా పొడిచాడు.

"నా మేలు నాశించే దేవుడేం దేవుడులే ? అంతగా వాడొచ్చి సహాయ మడిగితే అప్పుడు చేయకపోను ! లాభాలు సంపాదించే ఇచ్ఛే ఉంటే ఏ డిపార్టుమెంటైనా ఒకటే" అంటూ గోపాలరావు తండ్రికి ఉద్రేకంగా సమాధానం చెప్పి ఉద్యోగంలో చేరిపోయాడు.

"మానసికంగా వీ డెప్పటికి ఎదుగుతాడో పాపం !" అనుకొని జాలి పడ్డాడు తండ్రి.

"ఉద్యోగంలో చేరేకనే గోపాలరావు అనూరాధను ప్రేమించాడు. ఎక్కడ ? ఆమె దైవదర్శనార్థం గుడికి వస్తే !

వెనకా ముందు చూడకుండా అమాంతం ఆమెను పెళ్ళి చేసేసు కొంటానని రాయబారం పంపించాడు.

అనూరాధ అమిత అందంగా ఉంటుంది. అయితే పేద కుటుంబం. చదువులేదు. పెళ్ళిచేసే తాహతులేదు.

అంచేత అనూరాధ తండ్రి వెంటనే ఒప్పేసుకున్నాడు.

"కులాంతరమో మతాంతరమో చేసుకొంటావనుకొన్నా. చూచి చూచి ఛాందస కుటుంబంలో పిల్లనే ఎన్నుకున్నావే !"

నిజానికి పెళ్ళయ్యాక కాని అనూరాధ ఎంత ఛాందసురాలో గోపాల రావుకు తెలీలేదు. పూజ చేయందే పచ్చి మంచినీళ్ళు ముట్టదు. మడు లంటుంది. నోములు, వ్రతా లంటుంది.

గోపాలరావుకు మతిపోయింది. ఆమె అందంవెనుక "ఇన్ని వికృత ఆలోచనలున్నాయా ?" అనుకొని విచారించాడు. కానీ చేసేదేముంది ?

ఏ నోములు నోయాల్సిన అవసరం లేకుండానే అనూరాధ గర్భ వతి అయింది. అయినా మొదటి నలుసు మగపిల్లవాడు కావాలని పూజలు చేయసాగింది.

"చట్. మతి పోయిందా ఏమిటి ? పూజలు చేయంగానే కడుపులో పడ్డ బీజం రంగు మార్చుకుంటుందా ? లింగాన్ని మార్చుకుంటుందా ? పైగా ఆడయితేనేం ? మగయితేనేం ? పిచ్చివేషాలేయకు. ఆడకాని, మగకాని, పుట్టిన వాళ్ళను సక్రమంగా పెంచి గొప్పవాళ్ళనుచేసే ఆలోచ నలు చెయ్యి ఇంకా" భార్యను కసురుకున్నాడు గోపాలరావు.

అయితే అనూరాధ అలా లొంగే ఘట్టం కాదు. మత పరమైన విషయాల్లో మూఢ విశ్వాసాలు కలది. మొండిది. ప్రసవసమయంలో కూడా మగపిల్లవాడినే ఇమ్మని భగవంతుడిని మొరపెట్టుకుంది.

ఆడపిల్ల పుట్టింది.

ఆ వార్త విని అంతవరకూ "ఆడైతేనేం మగైతేనేం ?" అన్న ధీరాలుపోయిన గోపాలరావు కాస్త దిగులుపడ్డాడు.

"ఏమైనాడు నీ భగవంతుడు ? పది నెలలు పూజలు చేసేవుగా ? అందువల్లనే కన్నావేం?" తన నిరుత్సాహాన్ని కప్పిపుచ్చుకోటానికి భార్యను పొడిచాడు.

కానీ అనూరాధ పుట్టిన బిడ్డను చూచుకొని పొంగిపోతోంది. ఆడా మగా అన్న ఆలోచనే లేదు.

"ఏ బిడ్డ అయితేనేమండీ ? భగవంతుడికి మనకు ఆడపిల్ల నిద్దామని బుద్ధి పుట్టి ఉంటుంది. ఇచ్చాడు. చూడండి పాప ఎంత ముద్దొస్తున్నదో ?"

రెండో కాన్పూ ఇలాగే అయింది.

"ఇక ఆపరేషన్ చేయించుకో" చిరాగ్గా అన్నాడు గోపాలరావు.

"చ! అవేం మాటలండీ ? ఈ రెండో పిల్ల చూడండి. పెద్ద పిల్ల కన్నా అందగత్తె అయ్యేలాగుంది. మూడోసారి మగ పిల్లవాడిని కంటాలెండి. కొడుకును కనలేదని కోపగించకండి. దేనికైనా ప్రాప్తముండాలిగా ?"

మూడోసారి ఆడపిల్ల పుట్టినప్పుడు అనూరాధ బిడ్డను చూచుకొని మురిసిపోలేక పోయింది. తన దురదృష్టాన్ని తలచుకొని ఏడ్చింది.

"ఏమిటమ్మా—బంగారంలాంటి పిల్లను కని ఏడుస్తావు ? అందంగా ఆరోగ్యంగా ఎలాగుందో చూడు నీ కూతురు."

పిల్లను చూసింది. నర్సు మాటలు నిజమే. పెద్ద పిల్ల లిద్దరికన్నా అందగ త్తే ! తన అజ్ఞానానికి సిగ్గుపడింది అనూరాధ.

"ఈసారన్నా భగవంతుడు లేడని విశ్వసిస్తావా ? ఉంటే మూడు సార్లు నిన్నెందుకు మోసం చేస్తాడు ?"

"భగవంతుడు నన్నెప్పుడు మోసం చేశాడసలు ? కాన్పు సుఖంగా అవుతోంది. బంగారంలాంటి బిడ్డలు పుడుతున్నారు. అది నా పూజా ఫలమే. భగవంతుడి అనుగ్రహమే."

"అహా ! మరి ఈ ఆడపిల్లల వరస."

"అది మీ దురదృష్టఫలం. భగవంతుడిపై నా కొక్కదానికి విశ్వాసం ఉండగనే సరిపోయిందా ? మీకేదీ ? అందుకే ఈ దండన. ఈ సారి మీరు భగవంతుడిపై విశ్వాసం ఉంచండి చూద్దాం."

ఆపరేషన్‌ను అంగీకరించలేదు అనూరాధ. భగవంతుడిని విశ్వసించటానికి గోపాలరావుకి బుద్ధిపుట్టలేదు.

నాలుగోకాన్పూ ఆడపిల్లే. ఈ తడవ భర్తచేత అడిగించుకోకుండా తనే ఆపరేషన్ చేయించేసుకొంది అనూరాధ.

"అదేం ? ఇంకోసారి చూడకపోయావా ? నీ భగవంతుడు దయ తలచే వాడేమో !"

"చేసుకొన్నమ్మకు చేసుకొన్నంత అని—రాళ్ళపూజ చేసి రత్నాలు రమ్మంటే వస్తాయా ? నా ప్రాప్తం ఇంతే. అందుకు నాకు దిగుల్లేదు."

"మరి కొడుకు కొడుకని కలవరించావ్ ?"

"పుట్టక ముందు పుత్తే బాగుండునని కోరుకున్నాను. పుట్టని వాళ్ళ కోసం ఎక్కడ ఏడ్వను ? పుట్టిన పిల్లల్ని చూచుకొని సంతోషిస్తాను. అది చాలు. భగవంతుడు ఆ నలుగురిని చల్లగా చూస్తే నా కదేచాలు."

"అదీ ఆ భగవంతుడే చేస్తాడా ?"

"కాక? మీరూ, నేనా? మనిద్దరిలో ఎవరని కొట్టుకునేబదులు, మన కన్నా గొప్పదైన అజ్ఞాతశక్తి ఉందనుకోటం హాయి కదూ?"

"మూఢురాలు" అనుకొని చిరాకు పడిపోయాడు గోపాలరావు!

*  *  *

ఎంత కాదనుకొన్నా, వద్దనుకొన్నా, తనకు పుత్రులు లేరన్నభావన గోపాలరావును పట్టి పీడింప సాగింది. పైగా లోకుల మాటలు!

భార్య ఆ విషయమై దిగులుపడి ఏడుస్తూ కూర్చుంటే, తాను వోదారుస్తుంటే, అతని మనసుకు కొంత ఉపశమనంగా ఉండేదేమో! కానీ ఆమె ఆ విషయాన్నే పట్టించుకోటం లేదు.

పైగా ఎవరైనా "అయ్యో నలుగురూ ఆడపిల్లలేనా?" అని సానుభూతి చూపించబోతే "ఆడపిల్లలు చెట్టుకు కాచేదా ఏమండీ? నవమాసాలూ మోసి కన్నవాళ్ళేగా? ఎవరో లేదని దిగులుపడేం లాభం? మా ప్రాప్తం ఇంత అనుకుంటే సరి! పైగా ఆ భగవంతుడు మాకు అందర్నీ ఆడపిల్లల్నే ఉట్టిపుణ్యానికే ఇస్తాడా? ఆయన ఈ లీలకి అర్థం ఏదో ఉండే ఉంటుంది?" అనేది.

"దురదృష్టం" అన్న పదమంటేనే చిరాకుపడే గోపాలరావు తన ఈ దురదృష్టాన్ని ఎవరితో చెప్పగలడు? వోదార్పును ఎలా పొందగలడు?

అందుకని పిల్లల్ని మగపిల్లల్లాగే పెంచసాగేడు.

పెద్ద పిల్లలిద్దరి మధ్య ఎడం తక్కువ. వాళ్ళకు అయిదేళ్ళు వచ్చిందగ్గరి నుంచి, చదువుతోపాటు, సైకిలు తొక్కటం, మగాళ్ళ డ్రెస్సులు వేసుకోటం, బజార్లకుపోవటం, అందరితో కలిసి స్వేచ్ఛగా తిరగటం, మాట్లాడటం ఇత్యాది నేర్పసాగేడు.

వాళ్ళిద్దరికీ యుక్త వయసు వచ్చింది. స్త్రీ సహజమైన అందాలన్నీ

సంతరించుకొన్నారు. అయినా మగవాళ్ళ డ్రెస్సులు, సైకిళ్ళు త్రొక్క-టాలు....జాస్తి. ఏ పనైనా చేయగలరు.

"పుట్టుకలో ఏముందండీ ? పిల్లల్ని పెంచడంలో ఉంది. మా పెద్ద పిల్లలిద్దర్నీ చూడండి. మగ పిల్లలకన్నా వాళ్ళు ఎందులో తీసిపోయారు ? వాళ్ళు నా కూతుళ్ళు కాదండీ, కొడుకులు చూస్తుండండి. మా పెద్దమ్మాయిని డాక్టరును చేస్తా. రెండో అమ్మాయిని ఇంజనీరును చేస్తా. ఇరవయ్యోకటో శతాబ్దంలో కూడా ఇంకా ఆడా మగా అన్న వ్యత్యాసాలా ? తిరోగమ దృక్పథం అది. నా కసహ్యం."

గోపాలరావు ఈ ధోరణి అనూరాధకు మొదటి నుంచీ ఇష్టం లేదు. అటు మగ ఇటు ఆడా కాకుండా ఉభయ భ్రష్టత్వం చేస్తాడా ఇద్దరు పిల్లల్ని అని ఆమె భయం !

"చదువు చదవంగానే, ఉద్యోగాలు చేయంగానే, పేంటు షర్టులు వేసుకోగానే, సైకిళ్ళు తొక్కగానే ఆడపిల్లలు మగ పిల్లలుగా మారి పోతారా ? ఏం చోద్యం ? అలాగయితే హోటళ్ళలో వండి వడ్డించే వంట గాళ్ళంతా ఆడవాళ్ళే కావాలి గదా ? పిచ్చి ఆలోచనలు—వెర్రి భ్రమలు ! అయినా కొడుకులే అక్కర్లేదన్న వాడికి కూతుళ్ళని కొడుకులు చేయాలన్న ఈ కోరిక, మోజు ఏమిటో ? భగవంతుడి సృష్టిని తారుమారు చేయటం మీ తరమా ?"

అదుగో మళ్ళీ భగవంతుడంటున్నావ్ ?

కాక ? మీరసనా ? మీ చేతిలో, నా చేతిలో ఉంటే, ఒక రోజు ఇడ్లీ, మరో రోజు దోసె, గారెలు వండుకొన్నట్లు పిల్లల్ని కూడా మన అభిరుచుల మేరకు వండుకోక పోయామా ? ఈ ఏడుపు, తాపత్రయం దేనికి ?"

"భగవంతుడు లేడు, గాడిదగుడ్డూ లేదు. అసలు వేలిముద్ర దాన్ని

నిన్ను చేసుకోటం నా ఖర్మ! సైన్సు తెలీని మొద్దు మొఖానివి. మూఢు రాలివి. మగ-ఆడ అన్న సృష్టి, స్త్రీ పురుషుల యొక్క క్రోమోజోన్‌ల కలయిక మీద ఆధారపడి ఉంటుందని నీకు చెప్పి ఏం లాభం?"

"నన్ను చేసుకోవటం ఖర్మ అన్నారుగా? ఇదీ కర్మే అనుకొని సరిపెట్టుకో రాదూ? అలాగే ఆ క్రోమోజోన్లనే భగవంతు డనుకో రాదూ?"

"చట్ నీలాంటి మూఢులు చూడలేరు. కానీ, సూక్ష్మ దర్శినితో చూస్తే విజ్ఞాన వేత్తలకు ఆ క్రోమోజోన్లు కన్పిస్తాయ్. కానీ నీ భగ వంతుడు ఎవరికీ కన్పించడే?"

"ఎందుకన్పించడు?" అనూరాధ నవ్వుతూ అంది. "సూక్ష్మదర్శి నితో కాక, జ్ఞానదృష్టితో చూస్తే అంచక్కా కనిపిస్తాడు. నా లాంటి, మీ లాంటి మూర్ఖులకి కాదు. మహా జ్ఞానులకు, యోగులకు."

*    *    *

భార్యతో ఈ పోరు పడలేక, వాదనలు చెయ్యలేక మూడో కూతుర్ని ఆమె ఇష్టానికి వదిలేసేడు గోపాలరావు.

మూడో పిల్ల చదువుతోపాటు సంగీతం నేర్చుకుంది. డాన్సు చేయ గలదు.

"నా కూతురు సినిమాస్టారు అవుతుంది" అనుకుని మురిసిపోతుంది అనూరాధ. అంతలోనే చ. పాడు సినిమాస్టారు. నాకూతురు సుబ్బలక్ష్మిలా సంగీత సరస్వతి కావాలి" అంటుంది.

నాలుగో పిల్లకు పుస్తకాల పిచ్చి. బాలల పత్రికల్లో నాలుగైదు కథలు రాసి ప్రచురించిందప్పుడే.

"ఇది పెద్దవుతే నవలలు రాసి సులోచనారాణిలా రెండు చేతుల్తో డబ్బు సంపాదిస్తుంది."

అలా భార్యా భర్తలిరువురూ ఇద్దరేసి పిల్లల్ని తమ తమ అభిరుచులకు, ఆలోచనలకు అనుగుణంగా పెంచేరు. వాళ్ళపైన తమ భవిష్యత్తును కేంద్రీకృతం చేసుకున్నారు.

ఈ లోగా పెద్ద పిల్ల లిద్దరూ పెళ్ళిడుకొచ్చారు. గోపాలరావు రిటైర్మెంటు దగ్గర పడింది. అతడిని అనారోగ్యమూ ఆశ్రయించింది. కాళ్ళనొప్పులు....కీళ్ళ నొప్పులు.

పెద్ద కూతుర్ని డాక్టరు, రెండో కూతుర్ని ఇంజనీరు చేయిద్దామని మనసులో ఉన్నా రెంటిలో ఏ ఒకటీ చేయలేకపోయాడు గోపాలరావు. మిగతా కారణాలతోపాటు ధన లేమిత్వమూ అందుకో కారణమే.

సంపాదించే అవకాశాలు కాస్తో కూస్తో ఉన్నా గోపాలరావు ఎన్నడూ కక్కుర్తి పడలేదు. పైకి చెప్పడు కానీ లోపల దేవుడి సొమ్ము కైంకర్యం చేయటం పాపమేమో !" నన్న భయమో గౌరవమో కూడా అందుకు ఒక కారణమే. అందుకే అతనికి నిక్కచ్చి మనిషన్న పేరొచ్చింది.

మరి డాక్టరు చదువులు, ఇంజనీరింగు అంటే మాటలా ?

అంచేత ఇద్దర్నీ బియ్యేస్సీ చదివించాడు. ఎమ్మేస్సీ అన్నా చదివించాలనుకున్నాడు కానీ అదీ సాధ్యంకాలేదు. తన పలుకుబడిని ఉపయోగించి ఇద్దర్నీ గుమాస్తాలను చేశాడు.

"అదేమిటి ? మీ వాటంచూస్తే వాళ్ళను నిజంగానే మగపిల్లలను కొంటున్నట్లున్నారు. మగపిల్లలయినా పెళ్ళి చేయాలిగా ? ఆ విషయమే అనుకోరేమిటి ?"

"వెధవ పెళ్ళి లెద్దూ ? హాయిగా స్వతంత్రంగా బ్రతక్క ? నా కూతుళ్ళకు పెళ్ళిచేయను. నా దగ్గరే ఉంటారు."

గోపాలరావుకు వదిలేస్తే ఆ పనే చేసేవాడేమో !

పెద్ద పిల్ల బజారుకెళితే రోమియోల గోల. రెండోది సైకిలు

తొక్కుతుంటే తుంటరి డేష్ కొట్టేడు. ఇలాగే ఎన్నో సంఘటనలు—ప్రతి నిముషం వాళ్ళు ఆడపిల్లలని గుర్తుచేసే సంఘటనలు !

ఇది ఇలా ఉండగా రెండో పిల్ల ఒక తురకాడిని ప్రేమించిందని తెలిసింది.

"అమ్మాయ్ మీఅమ్మ మీ పెళ్ళిళ్ళకు తొందర పడుతోంది. నేనూ చేసేద్దామనుకుంటున్నాను."

ఎవరూ పెళ్ళి అక్కర్లేదనలేదు. పైగా అందరు ఆడపిల్లల్లాగే సిగ్గుపడ్డారు. చెక్కిళ్ళు కెంపులు కాబోయేయి !

తలను తాకట్టు పెట్టాడో, అమ్మనే అమ్మేడో ఇద్దరు కూతుళ్ళకు పెళ్ళి చేసిందాకా గోపాలరావు నిద్రపోలేదు.

* * *

రిటైరయ్యే నాటికి నాస్తిక భావాలు, పెన్షన్ డబ్బులతోపాటు గోపాలరావుకు సంక్రమించిన ఆస్తి కీళ్ళ నొప్పులు మాత్రమే !

ఎక్కడికీ కదలలేడు. కాని కదలక తప్పదు.

మూడోపిల్ల, నాలుగోపిల్ల పెద్దవాళ్ళయ్యారు. చేతికెక్కొచ్చారు. చదువులో ఎక్కొస్తున్నారు. వంటలు చేయగలరు. పాటలు పాడగలరు. నాలుగో కూతురు కథలూ రాస్తూంది. మూడో కూతురు సైకాలజీ చెప్తుంది.

కాని ఇద్దరికీ బజారు పనులు చాతకాదు. ఒంటరిగా వాకిట్లోకి కాలు పెట్టడానికి సిగ్గుపడేతత్వం.

అరకిలో చింతపండుకైనా బజారుకు గోపాలరావు వెళ్ళక తప్పదు.

పని కూడా లేదేమో గోపాలరావుకు ఒకటే దిగులు. భయం. "ఇప్పుడే ఇలాగుంటే ముందు ముందు గడిచేదెలా ?"

అయితే అన్ని ఆలోచనల్ని మనసులో బంధించుకోవలసిందే. అనూరాధతో అనాలంటేనే భయం.

"భగవంతుడి మీద భారాన్ని వేయండి. ఏబాధా ఉండదు?"

కీళ్ళ నొప్పులు కాకపోయినా అనూరాధ కూడా శరీరబాధలు లేక పోలేదు. అయితే ఆమెకు వాటి గురించి అంతగా పట్టించుకునే వ్యవధే ఉండదు.

తెల్లారితే పూజలు, సాయంత్రమవుతే భజనలు, పురాణాలు. మధ్యలో తీరికుంటే భారత-భాగవత పఠనం. ఇద్దరు కూతుళ్ళు తల్లికి ఈ విషయాల్లో దీటోలే.

ఇద్దరూ వొకే జీవితనౌకలో ప్రయాణంచేశారు. చేస్తున్నారు. అయినా తనకు మృగ్యమైన సుఖశాంతులు, విశ్రాంత ఆమెకు లభ్యం కావడానికి కారణం భగవంతుడి పట్ల విశ్వాసమేనా?

ఆరోజు అసలే ఒళ్ళు నొప్పులు ఎక్కువగా ఉన్నాయి. పెన్షన్ కోసం వెళ్ళి అందరి చుట్టూ తిరిగి తీసుకొచ్చేసరికి చుక్కల్లో చంద్రుడు కనిపించాడు.

ఇంటిని చూస్తూనే "రామా, రామా" అంటూ అరుగు మీద కూలబడి పోయాడు గోపాలరావు.

ఆ పిలుపు అందరికీ కొత్తే.

అందరూ కలిసి మంచం మీదకు చేర్చారు గోపాలరావుని.

"ప్రథమ సంతానం పుత్రుడు, ఆఖరి సంతానం పుత్రిక కలిగితే స్వర్గం వస్తుందని ఎందుకన్నారో తెలుసా అనూరాధా? వృద్ధాప్యంలో కొడుకు తండ్రి చేతికెక్కొస్తాడు, కూతురు తల్లికి ఆసరా అవుతుందనీ? అలా జరగకపోతే ఇదిగో ఇదేవరస. అనుభవిస్తున్నాగా?"

కాస్తంత చిన్నబుచ్చుకున్నా, మూడో పిల్ల దేవుడి ప్రసాదాన్ని పెట్టింది తండ్రికి. నాలుగో పిల్ల కాఫీ తీసుకొచ్చి ఇచ్చింది.

ప్రసాదాన్ని కాదనకుండా తీసుకున్నాడు గోపాలరావు. చిత్రం. కాస్సేపటికి నొప్పులు తగ్గినట్లనిపించాయి.

"భగవంతుడు లేడనుకోవడంలో కన్నా ఉన్నాడనుకోవడంలోనే ఎక్కువ లాభాలున్నాయ్ అనూరాధా. ముసలి తనంలో, దిసోకాల్డ్ హేతువాదాని కన్నా విశ్వాసమే హాయనిపిస్తుంది."

"డాక్టర్లేం చేస్తారండీ? చచ్చేవాడికికూడా రోగం తగ్గుతుందంటారు. ఎందుకు? మందులు చేయలేని పనిని మనోబలం చేస్తుందని. దానిని "సైకాలజీ" అంటారుట—అమ్మాయి చెప్పింది. దేవుడన్నదీ అలాంటి మందే."

"అయితే దేవుడు లేడంటావు?"

"ఎందుకు లేడు? మీరే నాదేముడు?"

"మరి నాకు."

"చెప్పుకోండి చూద్దాం."

కాస్సేపు ఆలోచించినట్లు నటించి గోపాలరావు అన్నాడు.

"నువ్వే. అందుకే రేపటి నుంచి నేను నీ మార్గాన్ని అనుసరించబోతున్నా."

ఇన్నాళ్ళకు మీరు తెలివైనమాట వొక్కటి మాట్లాడారండీ అంటూ అనూరాధ నవ్వింది.